సాక్షి
యాదాద్రి భువనగిరి

9

శనివారం, 29, మార్చి, 2025

ఉగాది కవితలకు ఆహ్వానం

వసంతాలకు అనాది.. శుభాలకు పునాది.. తెలుగు సంవత్సరాది ఉగాది. కోయిలమ్మ స్వరాల నడుమ, షడ్రుచుల మేళవింపులో కోటి ఆశలకు రెక్కలు తొడుగుతూ వచ్చే వేడుక ఇది. తెలుగుదనం ఉట్టిపడేలా. సంప్రదాయానికి జీవం పోసేలా సాగే పర్వదినమిది. కొత్త సంవత్సరం ప్రారంభమయ్యే వేళ కవుల భావాలకు 'సాక్షి' అక్షర రూపం ఇస్తోంది. మరి ఇంకెందుకాలస్యం.. కలాలు కదిలించండి ఉగాదిపై కవితలు రాయండి.

కవితలు పంపాల్సిన వాట్సప్ నంబర్
80962 93702
చివరి తేదీ : 29-03-2025

నోట్: మీరు పంపే కవిత ఎనిమిది నుంచి తొమ్మిది లైన్లకు మించకుండా ఉండాలి. కవిత చివర మీ పేరు, చిరునామా పేర్కొనాలి. దీంతో పాటు మీ లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కూడా పంపాలి. వచ్చిన కవితల్లో బెస్ట్‌గా ఉండేవాటిని ఎంపిక చేసి ప్రచురిస్తాం.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శనివారం సా॥)
సహర్ 4-50 (ఆదివారం ఉ॥)

ఫిలిప్పీన్స్‌కు యాదాద్రి బియ్యం

సాక్షి,యాదాద్రి : భువనగిరి జిల్లా నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి అవుతున్నాయి. తెలంగాణ నుంచి 8లక్షల టన్నుల బియ్యం ఎగుమతికి రాష్ట్ర ప్రభుత్వంతో ఫిలిప్పీన్స్ దేశం ఒప్పందం కుదర్చుకుంది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని నాలుగు మిల్లుల నుంచి 1,570 మెట్రిక్ టన్నులు బియ్యం ఎగుమతి చేయాల్సి ఉంది. తొలి విడతలో గురువారం 570 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ పోర్టుకు లారీల ద్వారా చేరవేశారు. అక్కడి నుంచి నౌకలో ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేయనున్నారు. మిగతా వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యాన్ని త్వరలో ఎగుమతి చేయనున్నారు. మరో 2 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతికి ఆర్డర్ లభించే అవకాశం ఉంది. కాగా జిల్లాలోని మిల్లుల్లో మర ఆడించిన బియ్యంలో చాకీ ఎక్కువ ఉందని రెండు నెలల క్రితం తిరస్కరించారు. దీంతో సివిల్ సప్లై అధికారులు మరోసారి ఫిలిప్పీన్స్ అధికారులను రప్పించి బియ్యం నాణ్యతను చూపడంతో ఎగుమతికి వారు అంగీకరించారు.



భువనగిరిలో మిల్లు నుంచి లారీలోకి బియ్యాన్ని లోడ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పేదింటి కల.. సాకారం దిశగా

పైలట్ ప్రాజెక్టుగా 17 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం



తుర్కపల్లి మండలం కోనాపూర్‌లో పునాది దశలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం



రాజాపేట మండలం బూర్గుపల్లిలో బేస్మెంట్ దశలో..

- 724 గృహాలకు 260 గ్రౌండింగ్
- కొన్ని బేస్మెంట్, మరికొన్ని పిల్లర్ల దశలో..
- ఉగాది తరువాత పనులు జోరందుకునే అవకాశం

సాక్షి, యాదాద్రి : నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. జిల్లాలో ఎంపిక చేసిన 17 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 724 ఇళ్లు మంజూరు కాగా కొన్ని పిల్లర్ల దశలో, మరికొన్ని పునాది దశలో ఉన్నాయి. ఉగాది తరువాత ఇళ్ల నిర్మాణ పనులు జోరందుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

తొలి విడతలో 724 ఇళ్లు మంజూరు

ప్రజాపాలన కార్యక్రమంతో పాటు ప్రత్యేకంగా నిర్వహించిన గ్రామ సభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 52,109 దరఖాస్తులు వచ్చాయి. తొలి విడతలో ప్రయోగాత్మకంగా జిల్లాలోని 17 మండలాల్లో 17 గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో 724 మంది లబ్ధిదారులతో జాబితా రూపొందించి ఇళ్లు మంజూరు చేసింది. వీరందరికీ ఇందిరమ్మ పథకం ప్రారంభం రోజు జనవరి 26న అధికారులు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఇందులో ఈనెల 28వ తేదీ నాటికి 260 ఇళ్ల గ్రౌండింగ్ పూర్తయ్యింది. ఇందులో 15 ఇళ్లు పునాది స్థాయిలో, మరికొన్ని పిల్లర్ల దశలో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణం సలువుగా సాగేలా గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మండలానికి ఒకటి చొప్పున మోడల్ ఇల్లు కూడా నిర్మిస్తున్నారు.

400 చదరపు అడుగులకు మించొద్దు

ఇందిరమ్మ ఇళ్ల జాబితాను ప్రభుత్వం మూడు విభాగాలుగా (ఎల్-1, ఎల్-2, ఎల్-3)గా విభజించింది. ఇందులో సొంతంగా ఇంటి స్థలం ఉన్న వారిని ఎల్-1 జాబితాలో చేర్చింది. వీరందరూ తొలి విడతలో ఇళ్లు నిర్మంచుకునేలా ప్రభుత్వం చేయూతనిస్తోంది. అయితే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే ఇల్లు నిర్మించుకోవాలి. అంతకుమించవద్దు. ఇంటిలోపల బెడ్రూమ్(అటాచ్ బాత్రూమ్), ఒక హాల్, కిచెన్ రానున్నాయి. పనులు ప్రారంభించే ముందు ఖాళీ స్థలం ఫొటో తీసి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. బేస్మెంట్, గోడలు, లెంటల్, శ్లాబులెవల్, ఇంటికి రంగులు వేసే ప్రతి స్థాయిలో ఫొటోలు తీసి యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం విడతల వారీగా రూ.5 లక్షలు మంజూరు చేస్తుంది. బేస్మెంట్ దశలో రూ.1 లక్ష, గోడలు పూర్తికాగానే రూ.1 లక్ష, శ్లాబులెవల్ రూ.2 లక్షలు, ఇంటికి రంగులు వేశాక రూ.1 లక్ష లబ్ధిదారు ఖాతాలో జమ చేయనుంది.

ఆర్థిక సాయం పెంచాలంటున్న లబ్ధిదారులు

లూజ్ సాయిల్, చౌడు లక్షణాలున్న భూముల్లో నిర్మించే ఇళ్లకు ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయం సరిపోదని లబ్ధిదారులు అంటున్నారు. అక్కడ బేస్మెంట్, శ్లాబు లెవల్‌లో రెండు దఫాలు బీములు పోయాల్సి ఉంటుందని, అదనంగా మరో లక్ష రూపాలు పెంచాలని కోరుతున్నారు.

నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా ప్రణాళికలు

ఇందిరమ్మ ఇళ్లు నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలి. పాత ఇళ్లకు, గతంలో నిర్మించిన, అసంపూర్తి ఇళ్లకు ఇందిరమ్మ పథకంలో బిల్లులు ఇవ్వడం కుదరదు. ఉగాది తర్వాత ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకుంటుంది. సకాలంలో పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించాం. లబ్ధిదారులకు ప్రభుత్వమే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తుంది.

–విజయ్‌సింగ్, హౌసింగ్ పీడీ

పర్యవేక్షణకు అధికారుల కొరత

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఇంజనీరింగ్ అధికారుల కొరత ఉంది. భువనగిరి డివిజన్‌కు ఒకరు, చౌటుప్పల్ డివిజన్‌కు ఒకరు చొప్పున ఇద్దరు డీఈలు మాత్రమే ఉన్నారు. మండలానికి ఒక ఏఈ ఉన్నారు. ప్రస్తుతం మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్‌గా తీసుకుని ఇళ్ల నిర్మాణం చేస్తుండడంతో ఇబ్బంది లేదు. అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు మొదలైతే పర్యవేక్షణకు, బిల్లులు చెల్లింపుల్లో జాప్యం ఏర్పడే అవకాశం లేకపోలేదు.



యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇల్లు



భువనగిరిలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, ఆర్డీఓ కృష్ణారెడ్డి, ముస్లిం మత పెద్దలు

సామరస్యమే అన్ని మతాల పండుగల సూత్రం

- ఇఫ్తార్ విందులో ఎంపీ, భువనగిరి ఎమ్మెల్యే, కలెక్టర్

భువనగిరి టౌన్ : సామరస్యమే అన్ని మతాల పండుగల సూత్రమని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని శుక్రవారం భువనగిరిలో అధికారికంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో వారు మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగలు భారత లౌకిక విధానాన్ని బలోపేతం చేస్తున్నాయన్నారు. రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకు ముందు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్ చిస్తీ, ముస్లిం మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రవాణాను అరికట్టాలి

- కలెక్టర్ హనుమంతరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

భువనగిరిటౌన్ : మాదకద్రవ్యాల రవాణా అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. మహిళా, శిశు, వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన నషా ముక్త్ భారత్(మిషన్ పరివర్తన) జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల రవాణాపై పటిష్ఠ నిఘా ఉంచాలని, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వ్యక్తులకు రిహాబిలిటేషన్ సెంటర్ల ద్వారా చికిత్స అందజేయాలని కోరారు. అంతకు ముందు 'డ్రగ్స్ కు నో చెప్పండి' అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, సంక్షేమ అధికారి నరసింహారావు, ఎక్సైజ్ సీపీఐ రాధాకృష్ణ, డీఎంహెచ్ఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

4,307 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సిద్ధం

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి,యాదాద్రి : రేషన్‌కార్డుదారులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నామని, ఇందుకోసం జిల్లాకు 4,307.669 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం కేటాయించినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2,03,193 ఆహారభద్రత, 13,711 అంత్యోదయ కార్డులు ఉన్నాయని, లబ్ధిదారులు 6,76,188 మంది ఉన్నారని వెల్లడించారు. ప్రతి లబ్ధిదారుడికి సన్నబియ్యం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు పౌరసరఫరాల అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. బియ్యం అందని లబ్ధిదారులు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

మునగాల: మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గురువారం రాత్రి సూర్యాపేట–ఖమ్మం జాతీయ రహదారిపై కూసుమంచి శివారులోని ఫ్లెఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ జానీపాషా(30)గ్రామపంచాయతీలో సిబ్బందిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం తన అత్తగారి ఊరైన ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం లాలాపురం గ్రామానికి బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జానీపాషా తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఐదేళ్ల లోపు వయస్సు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి



అంజయ్య గౌడ్ (ఫైల్)

మునుగోడు: గీతకార్మికుడు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేశిడి అంజయ్య గౌడ్ (65) గీతకార్మికుడు. రోజుమాదిరిగా గురువారం సాయంత్రం గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కుతుండగా కాలుజారి పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

టిప్పర్ దగ్ధం



దగ్ధమైన టిప్పర్ లారీ

మోత్కూరు: మరమ్మతులకు తీసుకెళ్తున్న టిప్పర్ లారీ ఇంజన్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన మోత్కూరు మండలం పాడిచేడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మోత్కూరు ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణం హనుమాన్‌నగర్‌లోని ఏమిరెడ్డి జలేందర్‌రెడ్డికి చెందిన టిప్పర్ లారీ మరమ్మతులకు గురికాగా డ్రైవర్ వేముల వెంకటేషం అమ్మనబోలు గ్రామం నుంచి మోత్కూరు మీదుగా ఉప్పల్‌కు తీసుకెళ్తున్నాడు. మోత్కూరు మండలంలోని పాడిచేడు, అనాజిపురం గ్రామాల మధ్య ఇంజన్‌లో ఒకేసారి మంటలు వ్యాపించాయి. వాహనం పక్కకు నిలుపుతుండగానే మంటలు చెలరేగి టిప్పర్ పూర్తిగా దగ్ధమైంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

రెవెన్యూ వ్యవస్థలో నూతనోత్సాహం

- తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

సాక్షి,యాదాద్రి : ప్రజా ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో నూతనోత్సాహం వచ్చిందని తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరిలోని వివేరా హోటల్‌లో టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒకరు చొప్పున గ్రామ పరిపాలన అధికారులను నియామకం చేయడం వలన రైతులకు రెవెన్యూ సేవలు చేరువ కావడంతో పాటు రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయన్నారు. దీంతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత ఆప్షన్ల ద్వారా నియామకం చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వ సహకారంతో దేశ చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాధించామన్నారు. అలాగే గతంలో ధరణిలో తహసీల్దార్లకు, ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాలు లేని కారణంగా రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించే పరిస్థితి లేదన్నారు. కానీ త్వరలోనే అమల్లోకి రాబోతున్న భూ భారతి చట్టం ద్వారా అధికారాల వికేంద్రీకరణ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉందన్నారు.

క్షేత్రస్థాయికి రెవెన్యూ సేవలు..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన భూ సంస్కరణలతో ఏకంగా భూ సమస్యల పరిష్కార వేదిక జిల్లా కేంద్రానికి చేరడంతో రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మళ్లీ గ్రామీణ స్థాయి రెవెన్యూ వ్యవస్థ క్రమంగా బలోపేతం అవుతుందని లచ్చిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యకారుడు ఏపూరి సోమన్న ఆట,పాటలు సభికులను ఉత్సాహపర్చాయి. ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, కోశాధికారి వెంకట్ రెడ్డి, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, కోశాధికారి మల్లేశం, పూర్వపు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేందర్ రావు, భువనగిరి ఆర్డీఓ కష్ణారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎస్డీసీ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, టీజీటీఏ సెక్రటరీ జనరల్ పూల్ సింగ్, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షులు పి.రాధ, టీజీటీఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చిల్ల శ్రీనివాస్, టీజీఆర్ఎస్ఏ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత చౌహాన్, టీజీఆర్ఎస్ఏ సీసీఎల్ఏ విభాగం అధ్యక్షులు కష్ణ చైతన్య, టీజీటీఏ నల్లగొండ జిల్లా అధ్యక్షులు పి. శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ జీ. దశరథ, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఆర్. అమీన్ సింగ్, జనరల్ సెక్రటరీ బి. రామకష్ణ రెడ్డి, యాదాద్రి, సూర్యాపేట, నల్లగొండ జిల్లా తహసీల్దార్లు, టీజీఆర్ఎస్ఏ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఎస్.కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రామకష్ణ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎం. రాంరెడ్డి, జనరల్ సెక్రటరీ బి.కట్లమయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కె. వెంకట్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బి.పల్లవి ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన రెవెన్యూ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ప్రీమియర్ పరిశ్రమలో నేడే ఎన్నికలు



యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట మండలం పెద్దకందకూరు గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలో జరుగుతున్న యూనియన్ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపిస్తున్నాయి. ఓవైపు టీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి బీఎంఎస్ యూనియన్‌ను కలుపుకుని ప్రాతినిధ్యం వహిస్తుండగా, మరో వైపు సీఐటీయూ.. హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీలతో జతకట్టి, భూపాల్ అధ్యక్షతన, స్థానిక ఎమ్మెల్యే అండతో పోటీకి దిగింది. ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఫలితాలు కూడా ఇదే రోజు సాయంత్రం వెలువడతాయి.

12వ వేతన ఒప్పందం

పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ 1985 సంవత్సరంలో మైనింగ్ ఎక్స్‌ప్లోజివ్ పేరుతో మొదలై, ప్రీమియర్‌ఎక్స్‌ప్లోజివ్‌గా రూపాంతరం చెందింది. కార్మికుల సమస్యలు, సంక్షేమం, శ్రేయస్సు కోసం ఈ పరిశ్రమలో 1992 సంవత్సరంలో మొట్ట మొదటి యూనియన్ ఎన్నిక జరిగి, ఒకటవ వేతన ఒప్పందాన్ని యాజమాన్యంతో మాట్లాడి చేసింది. ఇప్పుడు 12వ వేతన ఒప్పందం 2025లో చేయడానికి, కార్మిక యూనియన్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు, పరిశ్రమలో బీఎంఎస్ యూనియన్ 7సార్లు, టీఆర్ఎస్‌కేవీ 2, సీఐటీయూ 2సార్లు, గెలుపొందాయి. ఈ పరిశ్రమలో గుర్తింపు కలిగిన కార్మిక ఓటర్లు 391 మంది ఉన్నారు. కార్మికులు పలు యూనియన్‌లలో సభ్యత్వం కలిగి ఉన్నారు.

బాలికపై అత్యాచారయత్నం



విచారణ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌గౌడ్

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): బతుకుదెరువు కోసం ఇటుకబట్టీలో పని చేయడానికి వచ్చిన బాలికపై ఇటుకబట్టీ యజమాని అత్యాచారయత్నం చేశాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాత సూర్యాపేట శివారులో వెంగమాంబ బాలాజీ ఇటుకబట్టీ యజమాని గోగినేని వెంకటరమణ ఇటుకల తయారీ కోసం కొందరు కూలీలను ఒడిశా నుంచి తీసుకువచ్చాడు. బుధవారం మద్యం మత్తులో ఉన్న వెంకటరమణ అక్కడే పనిచేస్తున్న బాలికను చాక్లెట్ ఇస్తా అని పిలిచి అత్యాచారయత్నం చేశాడు. బాలిక భయంతో కేకలు వేస్తూ అక్కడి నుంచి బయటకు వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. దీంతో ఒడిశా నుంచి వచ్చిన కూలీలు వెంకటరమణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బాలిక కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఇటుకబట్టీ యజమాని వెంకటరమణను అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. శుక్రవారం బాలికను భరోసా సెంటర్‌కు తరలించి వాంగ్మూలం రికార్డ్ చేశారు. ఈమేరకు వెంకటరమణపై పోక్సో, లేబర్ యాక్ట్, జువైనల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో శుక్రవారం పోతగల్ల నర్సింహపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. ఉదయం స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులపై కోతులు దాడి చేయడానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న నర్సింహ కర్రతో కొట్టి వాటిని బెదిరించే ప్రయత్నం చేశాడు. దాంతో కోతుల గుంపు ఇతడిపై దాడి చేశాయి. నర్సింహను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మానసికస్థితి సరిగా లేని మహిళ ఆత్మహత్య

చింతపల్లి: మానసికస్థితి సరిగా లేని మహిళ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడ్‌లో చోటుచేసుకుంది. ఎస్సై యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కుర్మేడ్ గ్రామానికి చెందిన అనంతుల వెంకటమ్మ (50) మానసికస్థితి సరిగా లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటుంది. గురువారం రాత్రి భర్త వెంకటయ్య, ఇద్దరు కుమారులు అనంతల శ్రీను, శ్రీశైలం ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున నిద్రలేచి చూసేసరికి వెంకటమ్మ ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

గట్టుప్పల్: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భీమనపల్లి సైదులు(45) తనకు ఉన్న కొంత భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బోరు మోటారు ఆన్ చేసేందుకు వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లాడు. ఈ క్రమంలో మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జేఎన్‌వీ ఆరో తరగతి ఫలితాల్లో స్వల్ప మార్పులు

పెద్దవూర: జవహర్ నవోదయ విద్యాలయం 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడి సందర్భంగా మూడు హాల్‌టికెట్ నంబర్లు తప్పుగా ప్రచురితమయ్యాయని చలకుర్తిలోని జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్‌వీ) ప్రిన్సిపాల్ నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జె3612095కు బదులుగా జె3612094 అని, ఓ3614631 స్థానంలో ఓ3614637 అని, ఎల్3615157 స్థానంలో జె3615154గా మార్చుకోవాలని, ఈ మార్పును విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని ఆయన కోరారు.

ఎండోస్కోపిక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఎయిమ్స్‌లో ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ చేస్తున్న వైద్యులు

బీబీనగర్: వెన్నెముక వ్యాధితో బాధపడుతున్న రోగులు ఎయిమ్స్ వైద్య కళాశాలలోని అందిస్తున్న అత్యాధునిక సర్జరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ మహేశ్వర్ లక్కిరెడ్డి, స్పైన్ సర్జన్ డాక్టర్ సయ్యద్ ఇఫ్తేకర్ కోరారు. ఎయిమ్స్‌లోని ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ సేవలను అందుబాటులోకి తెచ్చిన సందర్భంగా వారు శుక్రవారం దీనిని సంబంధించిన వివరాలు వెల్లడించారు. రోగులు త్వరగా కోలుకునే విధంగా వెన్నెముక శస్త్ర చికిత్సలో కొత్త శకాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. దీర్ఘకాలిక వెన్నునొప్పితో బాధపడుతున్న వారికి ఎండోస్కోప్ సాయంతో చిన్న కోతల ద్వారా సర్జరీ చేయొచ్చని తెలిపారు.

జాతీయ విద్యాశాస్త్రం కోర్సుపై అవగాహన సదస్సు

బీబీనగర్: మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో జాతీయ విద్యాశాస్త్రం కోర్సుపై 5రోజుల పాటు జరిగిన అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా వైద్య విద్యార్థులకు బోధనా పద్ధతులు మెరుగు పరచడం, నిబద్ధతను ప్రతిబింబింపజేయడం, డిజిటల్ సాధనాలు, మైక్రో టీచింగ్, క్లినికల్ ఎక్స్‌ప్లోజర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ బాటియా, డీన్ రాహుల్ నారంగ్, వైద్యులు జయ ప్రగసరస్సన్, లక్ష్మిజ్యోతి, రోహిణి, రేఖాప్రియదర్శిని, అశుతోష్, ప్రసూతి, మధుసూదన్, శివరామన్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆగి ఉన్న గూడ్స్ ఆటోను ఢీకొన్న లారీ

- ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు



రోడ్డు పక్కన బోల్తాపడిన గూడ్స్ ఆటో

చౌటుప్పల్ రూరల్: టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన గూడ్స్ ఆటోను లారీ ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం చౌటుప్పల్ మండలంలోని బొర్రోళ్లగూడెం గ్రామ స్టేజి సమీపంలో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడ్స్ ఆటో కొబ్బరి బొండాల లోడ్‌తో అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నుంచి ఘట్‌కేసర్‌కు వెళ్తోంది. చౌటుప్పల్ మండలంలోని బొర్రోళ్లగూడెం గ్రామ సమీపంలో ఆటో టైర్ పంక్చర్ కావడంతో డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి టైరు తీస్తున్నాడు. ఈక్రమంలో కలకత్తా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ వెనుక నుంచి వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డు పక్కకు పల్టీ కొట్టి ఈ ప్రమాదంలో కోనసీమ జిల్లా రాజోలు మండలం గూడపల్లికి చెందిన ఆటో డ్రైవర్ మామిడిశెట్టి విజయనర్సింహకు తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ మహేష్‌కు చేతి వేళ్లు తెగి గాయాలయ్యాయి. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ఆటో డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి, లారీ డ్రైవర్‌ను చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గూడ్స్ ఆటో యజమాని జోగి పల్లంశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చల్లా యాదవరెడ్డి తెలిపారు.

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామికి గజవాహన సేవ



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం విశేష పర్వాలు కొనసాగాయి. ఉదయం ఆలయంలో నిత్య కల్యాణంలో భాగంగా శ్రీస్వామివారిని గజ వాహనంపై ప్రథమ ప్రాకార మండపంలో ఊరేగించారు. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాడ వీధుల్లో సేవోత్సవం చేపట్టారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజలి సేవోత్సవం నిర్వహించారు.

రేపటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి అనుబంధ ఆలయమైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు శ్రీసీతారామచంద్ర స్వామి వారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్‌రావు శుక్రవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 5న రాత్రి 8గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవం, 6న శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణం, 7న శ్రీసీతారామచంద్రస్వామి వారి పట్టాభిషేక మహోత్సవం, రాత్రి 8గంటలకు శ్రీస్వామి వారి డోలోత్సవం, 8న శ్రీసత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 9న నిత్య పూజలు ఉంటాయని తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు

- ఆరుగురికి జరిమానా

సూర్యాపేటటౌన్ : మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురిని అరెస్టు చేసి సూర్యాపేట స్పెషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వెంకటరమణ ఎదుట శుక్రవారం హాజరు పరచగా ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, మరో ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపిన వివరాల ప్రకారం ... ఈ నెల 27న సాయంత్రం సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా ఏడుగురు వ్యక్తులు పట్టుపడ్డారు. వారిని శుక్రవారం సూర్యాపేట స్పెషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. వీరిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్షతోపాటు మిగిలిన వారికి రూ.వెయ్యి చొప్పున జరిమాన విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



యాదయ్య (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామ శివారులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్ పోచంపల్లి మండలం జూలాల్‌పూర్ గ్రామానికి చెందిన గుండ్ల యాదయ్య(68) రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లోయపల్లి గ్రామంలో ఉంటున్న తన పెద్దకుమార్తె ఇంటికి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్లి వస్తున్నాడు. తుప్రాన్‌పేట గ్రామ శివారులోని దండుమైలారం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి ఎక్కుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో యాదయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అల్లుడు మోర సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్లా యాదవరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



సతీష్ (ఫైల్)

సూర్యాపేటటౌన్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సూర్యాపేట మండల పరిధిలోని రాజనాయక్ తండా సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామానికి చెందిన పేరెల్లి అంజయ్య– మల్లమ్మల కుమారుడు సతీష్(26) సూర్యాపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం చౌటుప్పల్ మండలంలోని ఖైతాపురం గ్రామ స్టేజి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం చెన్నపల్లికి చెందిన పొట్ట శ్రీనివాసులు, జడ్చర్ల మండలం నెక్కొండ గ్రామానికి చెందిన వేపూరి రామస్వామి గత కొంతకాలంగా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నివాసముంటూ పెయింటింగ్ పనులు చేస్తున్నారు. శుక్రవారం చౌటుప్పల్‌లో ఓ ఇంటికి పెయింటింగ్ వేయడానికి చౌటుప్పల్ కు బైక్‌పై వస్తున్నారు. ఖైతాపురం గ్రామ స్టేజి సమీపానికి రాగానే ఎదురుగా రాంగ్‌రూట్‌లో మరో బైక్ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పొట్ట శ్రీనివాసులు, వేపూరి రామస్వామి గాయపడ్డారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్లా యాదవరెడ్డి తెలిపారు.



పాట చిత్రీకరణలో డ్యాన్సర్లు జాను లిరి, కార్తీక్‌రెడ్డి

ముక్తాపూర్‌లో జానపద పాట చిత్రీకరణ

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయం, పంటపొలాల మధ్య శుక్రవారం జాజిరి జాజిరి అనే జానపద పాటను చిత్రీకరించారు. ఎస్ఎస్ మ్యూజిక్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ పాటలో చిత్రీకరణలో డ్యాన్సర్లు జాను లిరి, కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. నవ్రుత్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరించారు. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామానికి చెందిన నిర్మాత నూకల అశోక్ యాదవ్ మాట్లాడుతూ బావ, మరదలు మధ్య జరిగే సరసాలతో జానపద పాటను చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు.

వేసవిలో పండ్ల తోటలకు పొంచి ఉన్న ముప్పు



కొప్పోలులో కాలిపోయిన బత్తాయి తోట (ఫైల్)

గుర్రంపోడు: వేసవిలో పండ్లతోటలకు అగ్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. 20 ఏళ్లపాటు దిగుబడులు ఇచ్చే బత్తాయి, నిమ్మలాంటి తోటలు అగ్ని ప్రమాదాలకు గురైతే రైతులు ఆర్థికంగా కోలుకోవడం కష్టమే. ప్రతియేటా వేసవిలో జరుగుతున్న అగ్నిప్రమాదాలతో కాలిన పండ్లతోటలకు నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నా పరిహారం అందిన దాఖలాలు లేవు. ఇటీవల కొప్పోలు గ్రామంలో ఓ రైతు చెత్తను తగలబెట్టేందుకు నిప్పు పెట్టగా వ్యాపించి పక్కనే ఉన్న బత్తాయి తోటలోని 70 చెట్లు కాలిపోయాయి. రైతులు వేసవిలో జాగ్రత్తలు పాటించి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను ప్రాంతీయ ఉద్యానవనశాఖాధికారి మురళి వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మోటార్ల సర్వీస్ వైర్లు, కేబుల్ వైర్లు అతుకులు లేకుండా చూసుకోవాలి. నేల మీద వైర్లు లేకుండా చూసుకోవాలి. వేడిమికి షార్ట్‌సర్క్యూట్‌తో ఎండిన ఆకులు నిప్పంటుకుంటాయి.
- విద్యుత్ సర్వీసు వైర్లు, ఫ్యూజుల నుంచి స్టార్టర్ వరకు గల వైరు నాసిరకంగా ఉంటే లోవోల్టేజీతో వేడెక్కి కాలిపోయి మంటలు అంటుకుని వ్యాపించే అవకాశం ఉంది. – స్టార్టర్ డబ్బాలు నేలపై అడ్డంగా ఉంచడం వల్ల ఎలుకలు దూరి వైర్లు కత్తిరించడం వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగి పక్కనే గల ఎండు ఆకులకు మంటలు అంటుకుంటాయి.
- తోటల్లో కరెంట్ స్తంభాల మధ్య లూజ్ లైన్ లేకుండా చూసుకోవాలి. లూజ్‌లైన్ల వల్ల గాలిదుమారాలకు తీగలు ఒకదాని కొకటి తగిలి నిప్పురవ్వలు నేలపైబడి గడ్డి అంటుకునే ప్రమాదం ఉంది.

పాడిపంట

- తోటల్లో చెట్ల మధ్యలో వేసవికి ముందే దున్నుకోవాలి. కలుపు మందులు వాడితే ఎండిన గడ్డిని పీకేయాలి. వేసవిలో తోటల్లో చెత్తకు నిప్పుపెట్టకూడదు.
- తోటల చుట్టూ జీవకంచె ఉంటే అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు అదుపులో ఉండేందుకు కంచె మధ్యలో ఎడం ఉండేలా ఖాళీ స్థలం ఉంచుకోవాలి. తోట గెట్ల వెంట గడ్డి వాములు ఉంచకూడదు.
- అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తోటల్లో అంతరకృషి లేకుండా ఎండు గడ్డి బాగా ఉంటే డ్రిప్ లాటరల్ పైపులు కాలిపోయి తీవ్ర నష్టం జరుగుతుంది.